భవనం సిద్ధం.. ఎప్పుడు ప్రారంభం?



గట్లమల్యాలలో ప్రారంభానికి నోచుకోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పూర్తయిన ఆస్పత్రి నిర్మాణం
- సేవల కోసం ప్రజల ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు, నేతలు

నంగునూరు(సిద్దిపేట): అన్ని హంగులతో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తయినా వైద్య సేవలందక ప్రజలు పరేషాన్ అవుతున్నారు. వైద్య పరికరాలు, పర్నీచర్‌తోపాటు వసతులు సమకూర్చకపోవడంతో భవనం అలంకారప్రాయంగా మారింది. ప్రహరీ కూడా లేకపోవడంతో ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారిందని, పరిసరాలు చెత్తాచెదారంతో నిండాయని గ్రామస్తులు వాపోతున్నారు.

కొన్ని ప్రాంతాలకు అందని సేవలు

మండలంలో రెండు పీహెచ్‌సీ సెంటర్లు, ఆరు పల్లె దవాఖానలు, నాలుగు సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నంగునూరు ఆస్పత్రిని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ 50 పడకల ఆస్పత్రిగా మార్చారు. అలాగే రాజగోపాల్‌పేటలోని పీహెచ్‌సీ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. వాగవతల గ్రామాల ప్రజలకు సకాలంలో మైరుగైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది నియామకం ఎప్పుడు?

ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గట్లమల్యాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఆరు పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.2 కోట్లు విడుదల కావడంతో డిసెంబరు 2022న ఆయన భూమిపూజ చేశారు. అయితే అన్ని హంగులతో భవనం పూర్తయినా బెడ్లు, వైద్య, ల్యాబ్ పరికరాలు, పర్నీచర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియామకం కూడా కాలేదు.

పల్లె దవాఖానలో వైద్యం

వైద్య సేవల కోసం అక్కెనపల్లి, ఘణపూర్, ఖాత, కొండంరాజ్‌పల్లి, నాగసముద్రాల, ధర్మారంతోపాటు చిన్న తండాల నుంచి ప్రజలు గట్లమల్యాలకు వస్తుంటారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పల్లె దవాఖానలోనే ఇద్దరు వైద్యులు, ఒక స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ కలిసి ఓపీ సేవలు అందిస్తున్నారు.

త్వరగా ప్రారంభించాలి



గట్లమల్యాల మారుమూల ప్రాంతం కావడంతో చుట్టుపక్కల తండాలు, గ్రామాలు ప్రజలకు మెరుగైన సేవలు అందాలనే లక్ష్యంతో హరీశ్‌రావు గ్రామానికి ఆస్పత్రి మంజూరు చేయించారు. ఆరు పడకలతో ఇన్‌పేషెంట్ సేవలు అందించే అవకాశం ఉంది.

- కర్ణకంటి వేణుగోపాల్, గట్లమల్యాల

ఇబ్బందులు పడుతున్నాం



ప్రమాదాలు జరిగితే వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడంతో సకాలంలో చికిత్స అందడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆస్పత్రిలో అన్ని వసతులు సమకూర్చి మెరుగైన సేవలు అందిస్తే పేదలకు ఉపయోగంగా ఉంటుంది.

- రాజు, గట్లమల్యాల

క్లుప్తంగా

ఇల్లు ఇప్పించండమ్మా..!

కలెక్టర్‌ను వేడుకున్న వృద్ధుడు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: తనకు ఇల్లు ఇస్తానని అన్ని పత్రాలు అందించినా.. ఇప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఓ వృద్ధుడు కలెక్టర్‌ను వేడుకున్నాడు. మండల పరిధిలోని చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించేందుకు వచ్చిన కలెక్టర్ హైమావతిని గ్రామానికి చెందిన వట్టిపల్లి మోహన్‌రెడ్డి ఓ వృద్ధుడు తనకు రావాల్సిన ప్రభుత్వ సాయాన్ని అందించి న్యాయం చేయాలంటూ వాపోయాడు. తనకున్న 450 గజాల భూమిని రామాలయం నిర్మాణానికి తీసుకున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దానికి కలెక్టర్ స్పందించి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి రమ్మని సూచించారు.

సత్ప్రవర్తన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి మిలింద్‌కాంబ్లి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండటం చాలా అవసరమని స్థానిక న్యాయమూర్తి మిలింద్‌కాంబ్లి అన్నారు. జిల్లా జైలును శనివారం ఆయన సందర్శించారు. ఖైదీల వంటగది, భోజన వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వారానికి మూడు సార్లు జైలును సందర్శిస్తారన్నారు. న్యాయవాదులను నియమించుకోలేని వారికి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయ సహాయం అందిస్తుందని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ వికాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకే..



పరేడ్ పర్యవేక్షిస్తున్న సుభాష్ చంద్రబోస్

సిద్దిపేటకమాన్: పోలీసుల ఆరోగ్య పరిరక్షణ, క్రమశిక్షణ కోసమే వీక్లీ పెరేడ్ నిర్వహిస్తున్నట్టు అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. పోలీసు కమిషనరేట్ కార్యాలయ ఆవరణలోని పరేడ్‌గ్రౌండ్‌లో శనివారం వీక్లీ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, అంజయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల విడుదల ఎప్పుడు?



దీక్ష చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిద్దిపేటకమాన్: విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తాలో శనివారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వేణు, సాయి, నవదీప్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బట్టీ విధానం వద్దు



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు బట్టీ విధానం కాకుండా శాస్త్రీయంగా బోధించి, సృజనాత్మకతను పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బోధనోపకరణాల మేళాను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ రమేశ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా తరగతి గదులు

సాక్షి ఎఫెక్ట్..

హుస్నాబాద్‌రూరల్: పరికరాలు కొనుగోలు చేసి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని హెచ్‌ఎంల కమిటీ కన్వీనర్ లింగయ్యనాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రిప్రైమరి విద్య బోధనకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వినియోగించకుండా హెచ్‌ఎంల ఖాతాలకు జమ చేసుకున్నారనే సమాచారంతో సాక్షిలో 'పాఠశాలల నిధులు గాయబ్' అనే శీర్షికన శుక్రవారం వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించి ఆరా తీశారు. నిధులు మంజూరైన 11 పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశం ఏర్పాటు చేసుకొని నిధులను దుర్వినియోగం చేయకుండా పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఏకఓ సమక్షంలో తీర్మానించారు. సమావేశంలో హెచ్‌ఎంలు హరికిషన్, గాంధీ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



కేజీ కాలనీ పాఠశాలలో సిద్ధమైన ఆట పరికరాలు

ఊరంతా శుభ్రంగా ఉంచాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మూడు రోజుల్లో గ్రామం అంతా శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీఓ గుగులోతు మోహన్ నాయక్ ఆదేశించారు. 'కానరాని పారిశుద్ధ్య నిర్వహణ'.. విజృంభిస్తున్న విషజ్వరాలు అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని మంచినీళ్లబండ గ్రామాన్ని శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ఉంటే సహించబోమని అధికారులను హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలో ఆరోగ్య సిబ్బంది జ్వర సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

బాలమ్మకు ఇందిరమ్మ ఇల్లు
స్పందించిన కలెక్టర్ హైమావతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లికి చెందిన శ్రీపతి బాలమ్మ పరిస్థితిపై ఈనెల 21న 'సాక్షి' దినపత్రిలో ప్రచురితమైన కథనానికి శనివారం జిల్లా కలెక్టర్ హైమావతి స్పందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయించారు. ఎంపీడీఓ రాంరెడ్డి పీర్లపల్లికి వెళ్ళి బాలమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొహినొద్దిన్, కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీఓ మోహన్‌నాయక్



బాలమ్మకు ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ రాంరెడ్డి

'వయ్యారి భామ'తో అప్రమత్తం

శాస్త్రవేత్త పల్లవి

కొండపాక(గజ్వేల్): వయ్యారి భామ మొక్కలతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని, వాటిని తొలగించుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త పల్లవి సూచించారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో సిరిసిల్లా బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ వయ్యారి భామ పుప్పొడి వల్ల దగ్గు, దమ్ము, దురద, దద్దుర్లు లాంటి ఎలర్జీలు వస్తాయన్నారు. పొలాల్లో పూతదశకు రాకముందే కూకటి వేళ్లతో వాటిని పెకిలించి వేర్లతోసహా గుంటలో వేసి మట్టి కప్పి సేంద్రీయ ఎరువుగా మార్చుకోవచ్చన్నారు కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



వయ్యారి భామ మొక్కలను తొలగిస్తున్న పల్లవి, విద్యార్థులు

సులభతర బోధనే ముఖ్యం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): సులభతర విద్యా బోధన ఎంతో కీలకమని, విద్యా వ్యవస్థను మరింత పటిష్ట పర్చాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళాను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన పలు ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు అంజాగౌడ్, ప్రవీణ్‌బాబు, హెచ్‌ఎంలు రాజేందర్, బాలకిషన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య

నాచగిరి.. భక్తజన సిరి

కిటకిటలాడిన పుణ్య క్షేత్రం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి భక్తులతో శ్రావణశోభ సంతరించుకుంది. శ్రావణ మాసం చివరిరోజు కావడంతో శనివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. పుణ్యస్నానాలాచరించి భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. క్షేత్రంలో 23 నిజాభిషేకాలు, 9 సత్యనారాయణవ్రతాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

సిద్దిపేటఅర్బన్/కొండపాక(గజ్వేల్): గంజాయి విక్రయిస్తున్న యువకులను అరెస్టు చేసినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిందితుల వివరాలను వెల్లడించారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన కామల్ల రాకేశ్, దుద్దెడ గ్రామానికి చెందిన ఎండీ అమీర్, కుసుంబ ఆకాశ్, రొడ్డ నర్సింహులు గంజాయికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో దుద్దెడ శివారులో అంకిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు రైల్వే ట్రాక్ సమీపంలో నిందితులు ఉన్నారనే సమాచారంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 254.9 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.400 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

'సురవరం' మరణం తీరనిలోటు

సీపీఐ రాష్ట్ర నేత మల్లేశం

హుస్నాబాద్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మరణం దేశానికి, పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశం అన్నారు. పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో శనివారం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, కుమారస్వామి, పద్మ, రాజ్‌కుమార్, సుదర్శనచారి తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో ట్రాన్స్‌కో షాక్

కేబుల్ వైర్లు తొలగించిన సిబ్బంది



కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సిద్దిపేటజోన్: వివిధ రకాల కేబుల్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు విద్యుత్‌శాఖ షాకిచ్చింది. రామంతపూర్ దుర్ఘటన నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం జిల్లా కేంద్రంలో కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో కేబుల్, ఇంటర్‌నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది.

తప్పిదాలు సరిచేసుకోవాలి

సిద్దిపేటరూరల్: మస్టర్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, చెల్లింపులలో జరిగిన తప్పిదాలను సరిచేసుకోవాలని అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా తనిఖీ బృందం సేకరించిన వివరాలను శనివారం ఎంపీడీఓ కార్యాయలంలో నిర్వహించిన ప్రజావేదికలో వెల్లడించారు. రూ.48 వేలు రికవరీ చేయాల్సిందిగా శ్రీనివాస్‌గౌడ్ ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి గణేశ్, జ్యోతి, ఖాజాఆరిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

డీపీఓ దేవకీదేవి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపిస్తే చర్యలు తప్పవని డీపీఓ దేవకీదేవి హెచ్చరించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో డెంగీతో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె అధికారులతో కలిసి శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై వర్షపునీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ రాంరెడ్డి, తహసీల్దార్ నిర్మల తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

'స్వచ్ఛ్ బడి' భేష్

నెల్లూరు బృందం పరిశీలన

సిద్దిపేటజోన్: ఇంటింట చెత్త సేకరణ ద్వారా వచ్చిన చెత్తను పునర్వినియోగంచేసే ప్రక్రియ స్వచ్ఛ్ బడి వినూత్నంగా ఉందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నెల్లూరు మున్సిపాలిటీ అధికారులు కితాబిచ్చారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం సిద్దిపేట మున్సిపాలిటీలో పర్యటించారు. నిరుపయోగంగా ఉండే వస్తువుల్ని అందంగా అలంకరించిన వైనాన్ని అభినందించారు. స్వచ్ఛ బడిలో డిజిటల్ తరగతిగది, గోశాల, సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించారు. అనంతరం పట్టణంలో స్టీల్ బ్యాంక్ సందర్శించారు. స్వచ్ఛ సిద్దిపేట, ప్లాస్టిక్ రహిత పట్టణ లక్ష్యం గురించి సిద్దిపేట కమిషనర్ ఆశ్రిత్ వారికి వివరించారు. అనంతరం స్లాటర్ హౌస్, బుస్సపూర్ డంపుయార్డ్‌ను సందర్శించి తడిచెత్త ద్వారా బయోగ్యాస్ తయారీ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నెల్లూరు, సిద్దిపేట అధికారులు పాల్గొన్నారు.



ఎరువులు తయారీని పరిశీలిస్తున్న నెల్లూరు మున్సిపల్ అధికారులు

సమన్వయంతో ముందుకు సాగుదాం..

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేటరూరల్: నాయకులంతా సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి ముందుకు సాగుదామని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పిలుపునిచ్చారు. నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అభివృద్ధి పనులు చేయించాలని గౌడ కులస్తులు ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి అభ్యర్థనల గురించి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, రామచంద్రం, సేవాదల్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరికృష్ణను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

నాయీ బ్రాహ్మణుల ర్యాలీ

సిద్దిపేటజోన్: అన్యమతస్తులు, ఇతర కులాల వాళ్లు పట్టణంలో సెలూన్ షాపులు పెట్టొద్దని, కులవృత్తి మీద జరుగుతున్న కుట్రకు నిరసనగా శనివారం నాయీ బ్రాహ్మణులు ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి పట్టణ ప్రధాన వీధుల్లో శాంతి యుత ర్యాలీలో పాల్గొన్నారు. క్షవర వృత్తిని చట్టం చేయాలని, 50 యేళ్లకే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, ఆరోగ్య, ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్షులు కిషన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

సంక్షిప్త వార్తలు

◆ **ఇంజనీరింగ్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు**

హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.తిరుపతిరెడ్డి శనివారం తెలిపారు. కళాశాలలోని బీటెక్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

◆ **ఇసుక వేలం**

దుబ్బాకటౌన్: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ ఏడు ట్రాక్టర్ల ఇసుకకు సోమవారం ఉదయం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో వేలం వేస్తున్నట్టు తహసీల్దార్ సంజీవ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కల వారు రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

◆ **హామీలు నెరవేరేదెప్పుడు?**

సిద్దిపేటకమాన్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఉద్యమకారుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎప్పుడు నెరవేరుస్తుందని తెలంగాణ జేఏసీ రాష్ట్ర నాయకుడు వంగ గాలిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి ప్రశ్నించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, భారతి, కావేరి పాల్గొన్నారు.

◆ **ధర్నాను విజయవంతం చేయండి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీపీఎస్‌కు వ్యతిరేకంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు.

◆ **సోలార్ హైమాస్ట్ లైట్ ఏర్పాటుపై హర్షం**

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల మధిర భట్టి రామన్నపల్లిలో ఎంపీ రఘునందన్‌రావు రూ.1.20 లక్షల విలువచేసే సోలార్ హైమాస్ట్ లైటును గ్రామంలో ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి సోలార్ లైట్‌ను ప్రారంభించారు. ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కరుణాకర్, నరేశ్, పాండరి, రాజశేఖర్, కుమార్, గోపి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్‌లకు వినతి పత్రాలు**

చిన్నకోడూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం, ఆధ్వర్యంలో శనివారం చిన్నకోడూరు, మద్దూరు తహసీల్దార్‌లు సలీమ్, ఏజీ రహీంకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాలలో కనకయ్య, భాస్కర్, హరిప్రసాద్, రామకృష్ణ భాస్కర్, నందకుమార్, వెంకటేశ్వర్లు, మనోజ, అరుణ, వసంత పాల్గొన్నారు.

◆ **పద్మశాలీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ కళాశాలల్లో గతేడాది చదివిన పేద పద్మశాలీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని రోహిణి నర్సింగ్ హోమ్‌లో 10వ తేదీలోగా సంప్రదించాలని, పూర్తి వివరాలకు 93463 68837కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **అధికారులూ.. స్పందించండి!**

గజ్వేల్‌రూరల్: గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారిందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని 17వ వార్డు శివాలయం కాలనీవాసులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ మార్గం గుంతలమయమై కంకర తేలి ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్నిసార్లు నాయకుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరారు.

◆ **నిధుల మంజూరుపై హర్షం**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని నూతన పంచాయతీలకు నిధులు మంజూరు కావడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. హరీశ్‌రావు చొరవతోనే పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్యాక్స్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **అయ్యప్ప స్వాములకు స్వాగతం**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామం వద్ద శబరిమలకు మహా పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప మాలధారకులకు శనివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. సిరిసిల్లా జిల్లాలోని ముస్తాబాద్‌లోని అయ్యప్ప దేవాలయం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నవారు శనివారం లకుడారం చేరుకున్నారు. కార్యక్రమంలో గురుస్వామి రాజు, ముస్తాబాద్ మాజీ ఎంపీపీ శరత్‌రావు, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, లక్ష్మణ్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.